# ఒక...రాత్రి?!?

కె. శరత్ చంద్ర




**అది...... ఐదు గదుల ఇల్లు! చుట్టూ.... ఎత్తైన ప్రహరీగోడ. విశాలమైన గేటు. గేటుకు ఇరువైపులా కొబ్బరి చెట్లు! ప్రహరీగోడపైన రంగురంగుల పూబాలలకు ఆశ్రయమిస్తున్న పూలకుండీలు.**

ఇంటి చుట్టూ బాదం, నీలగిరి, జామ, సపోటా, గన్నేరు, నందివర్ధనం... ఇలా రకరకాల చెట్లున్నాయి. ఆ ఇంటివాళ్ళకు చెట్లంటే ప్రాణమని.........ఆ ఇంటివైపు చూసినవారెవరికైనా ఇట్టే తెలిసిపోతుంది.

ఇరవై రెండేళ్ళ వాసవి... కంప్యూటర్ సిస్టంను 'షట్‌డౌన్' చేసి, నెమ్మదిగా ఒంటింట్లోకి నడిచింది. సమయం... రాత్రి తొమ్మిది!!!

ఆమె తల్లిదండ్రులిద్దరూ బంధువుల పెళ్ళికని విజయవాడకు వెళ్ళారు. ఇప్పుడు

ఇంట్లో... ఆమె.... ఒక్కతే....!!!

తల్లిదండ్రులు ఆమెను కూడా తమవెంట రమ్మన్నారు.

కానీ... ఆమెలో ఒకింత ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ ఉంది. నలుగురిలో కలిసి తిరగడం, ఫంక్షన్స్‌కు అటెండవటం ఆమెకు అంతగా నచ్చదు. అందుకే, ఆమె వారివెంట వెళ్ళలేదు. వాసవి, ప్లేట్‌లో చపా తీలు, బంగాళాదుంప కూర పెట్టుకుని హాల్లోకి వచ్చి, టీ.వి ఆన్‌చేసి, సోఫాలో కూర్చుని తినసాగింది.

టీ.వి లో రామ్‌గోపాల్ వర్మ తీసిన 'దెయ్యం' సినిమా స్టార్టైంది. స్క్రీన్ అంతా..... నల్లగా మారింది.

చిక్....! చిక్...! చిక్....! చిక్.....!

ఎండుటాకులమీద ఏదో కదిలి చప్పుడు.

షీ......క్!!!

ఒక...... వెలుతురు కిరణం దూసుకొచ్చి.... అస్థిపంజరంలా మారింది. "హ్హిహ్హి హ్హిహ్హి.....!!!" దెయ్యాలు నవ్విన చప్పుడు. వాసవికి హర్రర్ సినిమాలంటే చచ్చేంత భయం. ఆమె, రిమోట్ కంట్రోలర్ చేతిలోనికి తీసుకుని, ఛానల్ మార్చింది. ఏదో.... డైలీ సీరియల్!!!

ఒక వ్యక్తి శవం చుట్టూ కూర్చుని, నలుగురు ఆడంగులు ఏడుస్తున్నారు. "ఇలా ఎంత సేపు ఏడుస్తారు. ఇక జరగాల్సింది చూడండి." అన్నారెవరో. ఆ తర్వాత నలుగురు యువకులు ముందుకొచ్చి...'పాడెను భుజాల మీదికి ఎత్తుకున్నారు. ఒక స్త్రీ గుండెలు బాదుకుని మరీ ఏడుస్తోంది. బహుశా.... ఆమె.... ఆ చనిపోయిన వ్యక్తి భార్య కావొచ్చు. పెద్ద కొడుకు, కుండ పట్టుకుని ముందుకు నడిచాడు. వారంతా శ్మశానం చేరుకున్నారు.

"కూ.....ళ్!" ఏదో అరిచింది.

"ఊఁ .......ఊఁ ........ళ్ళ్ళ్ళ్ళ్ళ్!!!" నక్కలు ఊళలు వేయసాగాయి. తీతువు పిట్ట.....'క్రీ.....చ్' మని అరుస్తూ..... వారి తలలపై నుండి ఎగురుతూ పోయింది.

గూళ్ళలోని గుడ్లగూబలు...గుడ్లు మిటకరించి చూస్తున్నాయి. మర్రి చెట్టుపై, కూర్చున్న రెండు రాబందులు...శవాన్ని సంబరంగా చూశాయి. "ఛీ...ఛీ ! వెధవ సీరియళ్ళు." అనుకుంటూ సిటీఛానల్ పెట్టింది. అందులో పాత తెలుగు పాటలు వస్తున్నాయి. "ఈ జీవన

తరంగాలలో.... ఆ దేవుని చదరంగంలో...... ఎవరికెవరూ.... సొంతము... ఎంతవరకీ బంధము...."

శోభన్‌బాబు కుండ పట్టుకుని పాడె ముందు నడుస్తున్నాడు. 'ఛ! ఇందులోనూ చావు పాటలేనా!" అనుకుంటూ మరో ఛానల్ పెట్టింది.

"నిను వీడని ....... నీడను...నేను! కలగా... మెదిలే... కథ నేను...!" ఓ స్త్రీ జుట్టు విరబోసుకుని, తెల్లచీరలో... అడవులలో తిరుగుతోంది.

వాసవి గుండె ఝల్లుమంది.

"ఛ!" అనుకుంటూ టీ.వి ఆఫ్ చేసింది.

ప్లేట్ ఖాళీ చేసి, తీసుకెళ్ళి సింక్‌లో పడేసి, హాల్లోకి వచ్చి, టేప్‌రికార్డర్ ఆన్ చేసి, చదువుకుంటూ కూర్చుంది.

సమయం...పదకొండున్నర!!

పుస్తకం ప్రక్కకు పెట్టి, లేచింది.

"ధ.......బ్!!! పెరట్లో ఏదో చప్పుడు.

వాసవి గుండె...ఒణికింది.

'ఏ.....మి.....టో......చ.....ప్పు.......డు. ......!.....?'

'బహుశా...జాంపండో...బాదంపండో..... చెట్టు నుండి రాలిపడుంటుంది? అని తనకు తనే సమాధానం చెప్పుకుంది.

కానీ.... చెట్టు నుండి జామపండు రాలి క్రిందపడితే.... అంత శబ్దం రాదు! ఈ విషయం ఆమెకు తెలుసు.

కానీ.... ఆమె...ఆ 'తర్కాని'కి విలువివ్వ లేదు. మనిషికి తర్కం తెలుసు.

కానీ.... కొన్ని సందర్భాలలో తర్కానికి పోకుంటేనే మంచిదని అభిప్రాయ పడుతుంటాడు ప్రతి మనిషి! ముఖ్యంగా...'భయం' ఆవహించినప్పుడు. ఒంటింట్లోకి వెళ్ళి..స్టౌ వెలిగించి...పాలగిన్నెను స్టౌ మీద పెట్టింది. ఒంటింటి కిటికీలో నుండి పెరడు అగుపిస్తోంది!!!

అవతల......చిక్కని...చీకటి!!!!

'కిర్....ర్ర్ ....ర్ర్.....ర్ర్.....'''' కీచురాళ్ళు అదేపనిగా.... శబ్దం చేస్తున్నాయి.

'టప్....! టప్......! టప్....!' ఏదో శబ్దం.

'ఏమిటా.....శ....బ్దం!?'

అరక్షణం లాజిక్‌గా ఆలోచించింది.

'బాత్రూంలోని కొళాయి నుండి కారుతున్న..... నీటి చుక్కల..... శబ్దం కావొచ్చు!?' అనుకుంది.

పెరట్లో ఏవేవో...... వింత శబ్దాలు.... వినిపిస్తున్నాయి.

ఆమె...శరీరంలో... నెమ్మదిగా... ఒణుకు.... ఆరంభమైంది. ఘల్....! ఘల్....! ఘ.....ల్!! ఘల్‌ఘల్! ఘల్‌ఘల్‌ఘల్! గజ్జెల చప్పుడు!!!

"ఆఁ.....!" ఎవరో స్త్రీ.... రోదిసున్న చప్పుడు. ఆ రోదన....రిథమిక్‌గా ఉంది.

ఆ రోదన....తరతరాల నుండీ..... హింసింపబడుతున్న... ఆడది చేసే రోదనలా ఉంది!!

"ష్......!" పాలు, పొంగి పొర్లిపోయాయి.

వాసవి, స్టౌ వైపు చూసింది.

రోదన ఆగిపోయింది.!

వాసవి, ధన్‌మని ఒంటింటి కిటికీ తలుపులు మూసేసి, స్టౌ ఆఫ్ చేసి, గబగబా హాల్లోకి వచ్చింది.




"ఎదురింటి వాళ్ళు ఇంకా మేలుకున్నారా" అనుకుంటూ, వరండాలో లైట్ వేసి. మెయిన్ డోర్ తెరిచి, ఎదురింటి వైపు చూసింది.

ఎదురింటి తలుపుకు తాళం అగుపించింది.

అప్రయత్నంగా ఆమె చూపు....తమ ప్రహరీగోడపై పడింది. గోడమీద....ఏదో ....... నల్లటి ఆకారం ......విచిత్రంగా కదలుతోంది.

అంతే......!!!

వాసవి తలలో నుండి చెమట బిందువులు...మొహం మీదికి రాలాయి. గబగబా లోపలికి వచ్చి తలుపేసి, సోఫాలో కూలబడింది. పావుగంటసేపు అలాగే కూర్చుని ఆంజనేయ దండకం చదివింది.

ఆ తర్వాత టీపాయ్ మీదున్న దినపత్రికను తిరగేయ సాగింది.

"ఉప్పల్‌లో ఓ యువతి మానభంగం.....హత్య!"

ఉప్పల్‌లోని ఒక ఇంట్లో నిన్న రాత్రి కల్పన(18) అనే యువతి దారుణంగా మానభంగం చెయ్యబడింది. నిన్న రాత్రి ఆమె తల్లిదండ్రులిద్దరూ .... ఆమెను ఒంటరిగా వదిలేసి....ఏదో పార్టీకి వెళ్ళారు. విషయం తెల్సిన ఆగంతకుడు...ఎలాగో ఆ ఇంట్లోకి ప్రవేశించి.... ఆ యువతిని మానభంగం చేశాడు. గంట తర్వాత..... ఇంటికి వచ్చిన ఆమె తల్లిదండ్రులు, ఆమెను హాస్పటల్‌కు తరలిస్తుండగా....ఆమె మరణించింది.

ఉప్పల్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు." వాసవి....ఒణుకుతున్న చేతుల్తో పేపర్‌ను దూరంగా విసిరేసింది.

'ట......ప్!" ఏదో శబ్దం వినిపించింది. వాసవి, తలతిప్పి చూసింది. వెంటిలేటర్‌లో నుండి ఓ రాయి వచ్చి హాల్లో పడింది. ఆ రాయికి రబ్బర్ బ్యాండ్‌తో ఓ కాగితం చుట్టబడి ఉంది. వాసవి...భయం భయంగా....కదిలి వెళ్ళి.... ఆ రాయిని చేతిలోనికి తీసుకుని....రబ్బర్ బ్యాండును తొలగించి. కాగితాన్ని తీసుకుని....... కాగితం మడతలు విప్పింది.

తెల్లని కాగితంపై....... చిక్కని ఎరుపు రంగులో...... రాసింది.

"నేను..... నీ..... రక్తం......త్రాగుతాను! ఇప్పుడే.....! ఈ...... రాత్రికే......!! హ్హిహ్హిహ్హి! హ్హిహ్హిహ్హిహ్హిహ్హి"

వాసవి చేతిలో నుండి కాగితం జారి క్రిందపడింది. ఆమె..... గుండెల్లో నుండి...... దుఃఖం ఎగదన్నుకొచ్చింది.

'బయటి నుండి ఈ రాయిని విసిరిం దెవరు?' మనసులో అనుకుంటుండగా...... "ట్రింగ్ ! ట్రింగ్ ట్రింగ్!!" ఫోన్ మోగింది. అంతటి నిశ్శబ్ద వాతావరణంలో...... ఫోన్ రింగ్ కూడా...... భయోత్పాతంగా ఉంది. ఒణుకుతున్న చేతుల్తో రిసీవర్ ఎత్తింది.

"హ...... హ......హలో!" అంది.

"హ్హీహ్హీహ్హీ.......! హ్హీహ్హీహ్హీహ్హీ.....!! ఈ రక్తపిశాచి....కోరల నుండి.... నువ్వు తప్పించుకోలేవు. హ్హీహ్హీహ్హీ....!! హ్హీహ్హీహ్హీ హ్హీహ్హీ...!!

ఈ...... రాత్రికి...... నిన్ను....హ్హీహ్హీ.... నిన్ను.......హ్హీహ్హీహ్హీ...!" ఫోన్ డిస్‌కనెక్ట య్యింది.

వాసవి ఒళ్ళంతా చెమటలతో తడిసి పోయింది.

వెంటనే ఏదో నిర్ణయించుకున్న దానిలా....రిసివర్ ఎత్తి పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసింది. ఫోన్ రింగవ్వలేదు.

మళ్ళీ ప్రయత్నించింది! ఫలితం శూన్యం.

"అంటే.....ఆ రక్తపిశాచి....టెలిఫోన్‌ను పని చేయకుండా చేసిందన్నమాట."

'ఫ......ట్!' వెంటిలేటర్‌లో నుండి సగానికి కోసేసిన నిమ్మకాయలు వచ్చి పడుతున్నాయి.

ఆ తర్వాత.... పగిలిపోయిన గవ్వలు.... వచ్చిపడుతున్నాయి.

'హ్హీహ్హీహ్హీ!! నేను.... వచ్చేస్తున్నా....హ్హీహ్హీహ్హీ !!" గట్టిగా అరుపు వినిపించింది.

"నో....!" గట్టిగా అరిచి, సొమ్మసిల్లి పడిపోయింది...... వాసవి.

✳ ✳ ✳

"టక్ టక్ ! టక్ టక్.......!!" ఎవరో తలుపు బాదుతున్నారు. వాసవి మేలుకుంది.

"తలుపు తియ్యండమ్మా!" పాలవాడి కేక. ఆమెలో ఇంకా ఒణుకు తగ్గలేదు. నెమ్మదిగా వెళ్ళి తలుపు తెరిచింది. బాలభానుడు తూరుపు కొండల్ని చీల్చుకుని పైకి వస్తున్నాడు. గిన్నెలో పాలు పోయించుకుని లోపలికి వచ్చింది.

'రాత్రి జరిగిందంతా.... నిజమేనా?!' మనసులో అనుకుంది. హాల్లో పడి ఉన్న నిమ్మకాయల ముక్కలు...గవ్వలు.... రాళ్ళు... రాత్రి జరిగిందంతా నిజమేననడానికి సాక్ష్యా లుగా అగుపిస్తున్నాయి.

ట్రింగ్ ట్రింగ్.....! ట్రింగ్ ట్రింగ్.....!! ఫోన్ మోగింది.

"ఫోన్ మోగుతుందేమిటి?!" ఆశ్చర్యపో తూనే వెళ్ళి రిసీవర్ ఎత్తింది.

"హలో!"

"హలో.... వాసవి! నేను...... రాగ సుధను మాట్లాడుతున్నాను."

"ఏంటే సుధ! ఇంత ఉదయమే ఫోన్ చేశావు....ఏంటి సంగతి?"

"ఊరికే చేశాను. నిమ్మకాయలు, గవ్వలు, రాళ్ళు.....ఓహ్..ఇల్లంతా చెత్త చెత్తగా ఉండుంటుంది కదూ! అన్నట్లు....ఇల్లంతా ఊడ్చావా లేదా?" అంది రాగసుధ నవ్వుతూ.

వాసవి, ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యింది.

"ఏంటే.....ఆశ్చర్యపోతున్నావా! రక్తపిశాచి దెబ్బకు...స్పృహ తప్పిపడిపోయావు కదూ!" అంది రాగసుధ.

"అది...... అది.... నీకెలా తెలుసు! ? !"

"నాకు గాకుండా ఇంకెవరికి తెలుస్తుంది చెప్పు!" అంది రాగసుధ మర్మగర్భంగా.

!!అ....అంటే?!"

"అంటే ఏముంది. ఆ రక్తపిశాచిని.... నేనే." అంది రాగసుధ నవ్వుతూ.

"వ్వాట్...! అంటే..... రాత్రి...నన్ను భయపెట్టింది నువ్వా...!"

"మరదే కదా.... చెప్పేది." అంది రాగసుధ, రిథమిక్‌గా.

"యూ..."

"ఏప్రిల్ ఫూల్....! ఏప్రిల్ ఫూల్.....!" అంది రాగసుధ. వాసవి దృష్టి అప్రయత్నంగా క్యాలెండల్‌పై పడింది.

"ఈ రోజు.... ఏప్రియల్ ఫస్టా! నేను... మరచేపోయాను." అంది.

"ఏంటి బుజ్జీ... ఎలా ఉంది. నా ట్రీట్!"

"హడలి చచ్చానే తల్లీ! రాత్రి ఫోన్‌లో అచ్చం రక్తపిశాచిలాగే మాట్లాడావు. ఇప్పట్నించి... నీ నిక్ నేమ్ రక్తపిశాచి. ఓ.కే!"

"వద్దే తల్లీ....!" అంది రాగసుధ.

"హమ్మా.... నేనూరుకుంటానా! రాత్రి నన్నంతగా భయపెట్టావుగా. దానికి ఇది రివేంజ్. కాలేజ్‌లో అందిర చేతా.... నిన్ను 'రక్తపిశాచి' అని పిలిపించకపోతే... నే పేరు వాసవే కాదు చూస్కో!" అంది.

"సరేసరేలే...! ఉంటాను మరి." అంది. రాగసుధ.

'ఏంటంత తొందర?!"

"ఇంకా ఉషను ఏప్రియల్ ఫూల్ చెయ్యాలి. సో...బైబై!" అంది రాగసుధ. వాసవి రిసీవర్ పెట్టేసి, హమ్మనా.... సుధ! ఎంత పని చేశావే....! ఇంకానయం... నా గుండె ఆగిపోలేదు! 'అనుకుని, గుండెపై చేయివేసుకుని గట్టిగా ఊపిరి పీల్చుకుంది వాసవి. ❋



## పుస్తకాలు:

**సంక్షిప్త రామాయణము**
**(ఆట వెలది పద్య కావ్యము)**
**రచన : మల్లెల రామయ్య**
**వెల: రూ.100/-**
**పేజీలు: 197**

**పుస్తకములు దొరుకు స్థలము : డా. మల్లెల రామయ్య, 2 జయంతి స్ట్రీట్, సీతాపతి నగర్, వేలచేరి, చెన్నై - 42.**

జనజీవన విధాన నిక్షిప్తమే సంక్షిప్త రామాయణం. మల్లెల రామయ్య ఆటవెలదు లతో ఆడుకొన్న గ్రంథరాజం. చక్కని, చిక్కని లాలిత్య శోభాయమానం సంక్షిప్త రామాయ ణం. సర్వజనులకు అవగతం పదరామణీయ కం. కొన్ని పద్యములు విత్తనం లేని ద్రాక్ష పండ్లే! కొన్ని పద్యములు కదళీఫలాలే! బాలకాండము అశ్వమేధయాగంతో ప్రారం భమై శ్రీరామ పట్టాభిషేకంతో పరిసమాప్తి చెందిన పద్యాల పరిమళం. ఒక ఘట్టము తర్వాత మరియొక ఘట్టము సమయ స్ఫూర్తిగా సాగింది. కథాంశములకు భంగం వాటిల్లలేదు. వాల్మీకి రామాయణాన్ని పుణికి పుచ్చుకొనిన తెలుగు వన్నెల చిన్నెల సృజనం సంక్షిప్తరామాయణం. ఆస్వాదిద్దాం, తరచి, తరచి చూద్దామా! అంటాయి నేత్రాలు. దైవం సాక్షాత్కరించాడా యన్నట్లు శ్రీసీతారామ లక్ష్మణ హనుమత్సమేత చిత్రం కవరు పేజీకి (అట్టమీద బొమ్మ) ముచ్చట గొల్పింది. చూచిన కన్ను తీసికోవాలనిపించేదే సంక్షిప్త రామాయణం. సరయూ నది వర్ణనతో ప్రారంభించి, రాఘవుని రాజ్య పాలనతో సంక్షిప్తం చేసిన ఘనత రామయ్య గారిదే. ప్రతి పద్యం హృద్యమయం. సాహిత్య మల్లెల పరిమళాలు, మల్లెల రామయ్య కలం నుండి జాలువారిన ఆటవెలది పద్యాలు. "త్రాహిత్రాహి యనుచు రామ విభుని", పొగడిరపుడు రామసుగుణధాము" మచ్చు నకు కొన్ని ముత్యాలు. ప్రతి గ్రంథాలయానికి అవశ్యకం సంక్షిప్త రామాయణం. సంక్షిప్త రామాయణ పఠనం రామాయణం సువిది తం. ప్రతి పఠిత తెప్పించుకొని ఉపయుక్తు లగుదురుగాక. **- విద్వాన్ కో॥ శ్రీ॥**